



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

శుక్రవారం,
మే 1, 2026

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-


## డీజీపీగా పదవీ విరమణ చేసిన వెంటనే.. శివధర్‌రెడ్డికి కీలక బాధ్యతలను అప్పగించిన ప్రభుత్వం



- డీజీపీగా నేడు పదవీ విరమణ చేసిన శివధర్ రెడ్డి
- రాష్ట్ర ప్రభుత్వ భద్రతా సలహాదారుగా నియామకం
- చీఫ్ సెక్రటరీ హోదాలో కీలక పదవి
- నెలకు రూ. 2.25 లక్షల వేతనం, ప్రత్యేక కార్యాలయం

## ఇంధన సరఫరాకు ఎలాంటి కొరత లేదు ::: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

- కొరత భయాలతో పెట్రోల్ బంకులకు ప్రజలు క్యూ కట్టవద్దని విజ్ఞప్తి
- నిన్న పెట్రోల్ వినియోగం రోజువారి సగటుతో రెండింతలు, డీజిల్ రెండున్నర రెట్లు పెరిగినట్లు వెల్లడి



## భార్య వివాహేతర సంబంధం కారణంగానే హుస్సేన్ సాగర్‌లో దూకి టెక్కీ ఆత్మహత్య

- ఫిబ్రవరి మొదటి వారంలో ఆత్మహత్య చేసుకున్న సీతారామ్ రెడ్డి
- కోడలి వివాహేతర సంబంధమే కారణమని సీతారామ్ రెడ్డి తండ్రి ఆరోపణ
- భార్యతో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు



# నాణ్యతపై రాజీ అస్సలు వద్దు

- విద్యార్థులకు జూన్ 15లోపు అన్ని సామగ్రి అందించాలని ఆదేశం
- నోటుబుక్కులు నుంచి యూనిఫాం వరకు ప్రతీదీ ప్రమాణాలతోనే ఉండాలి
- సంక్షేమ శాఖల సమీక్షలో అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన దిశానిర్దేశం
- వస్తువుల పంపిణీపై విద్యార్థుల నుంచే అభిప్రాయ సేకరణకు సూచన
- అవకతవకలకు తావులేకుండా కేంద్రీకృత కొనుగోలు విధానంపై దృష్టి



హైదరాబాద్: ప్రభుత్వ విద్యాసంస్థలు, గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు అందించే ప్రతి వస్తువు నాణ్యతతో ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. నోటు పుస్తకాలు, ట్రంక్ పెట్టెలు, ప్లేట్లు, గ్లాసులు, ట్రాక్‌సూట్లు, బెడ్‌షీట్లు, పాఠశాల సంచులు, గుర్తింపు కార్డులు, యూనిఫారాలు వంటి సామగ్రి విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని ఆదేశించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని వస్తువులు జూన్ 15 నాటికి పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సరఫరా పూర్తయ్యాకే సంబంధిత సంస్థలకు చెల్లింపులు చేయాలని పేర్కొన్నారు. విద్యాశాఖతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖల పరిధిలోని విద్యాసంస్థలకు సామగ్రి కొనుగోలు, పంపిణీపై గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీఎం ఈ సూచనలు చేశారు. గతంలో శాఖలవారీగా వేర్వేరుగా కొనుగోళ్లు జరగడంతో ప్రమాణాలు దెబ్బతినడమే కాకుండా అవకతవకలకు అవకాశం కలిగిందని పేర్కొన్నారు. అందుకే కేంద్రీకృత కొనుగోలు విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చామని వివరించారు. ఈ విధానం ద్వారా అన్ని విద్యార్థులకు సమాన నాణ్యత గల వస్తువులు అందేలా పర్యవేక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. విద్యార్థులకు పంపిణీ చేసే

(మిగతా 2వ పేజీలో)

# ‘బిజినెస్ రిఫార్మర్’ అవార్డు ఘనత మీదే..

## ప్రభుత్వ యంత్రాంగానికి చంద్రబాబు ఆత్మీయ విందు

- చంద్రబాబుకు ఇటీవల జాతీయస్థాయిలో బిజినెస్ రిఫార్మర్ అవార్డు నే
- మంత్రులు, అధికారులకు సీఎం ఆత్మీయ విందు
- మీరే అసలైన విజేతలు అంటూ ప్రభుత్వ యంత్రాంగానికి ప్రశంసలు
- జిల్లా, మండల స్థాయి ఉద్యోగులను కూడా ప్రత్యేకంగా ఆహ్వానించిన సీఎం
- సంస్కరణలు చంద్రబాబు డీఎన్‌ఏలోనే ఉన్నాయన్న మంత్రి పయ్యావుల
- భవిష్యత్ లక్ష్యాలు, వ్యూహాలపై ఉన్నతాధికారులతో సీఎం కీలక సమావేశం



తనకు జాతీయ స్థాయిలో ‘బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్-2025’ పురస్కారం లభించిన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్ర బాబు ప్రభుత్వ యంత్రాంగానికి ఆత్మీయ విందు ఇచ్చారు. ‘డిన్నర్ విత్ ది రియల్ విన్నర్స్’ పేరుతో అమరావతిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, వివిధ శాఖల కార్యదర్శులు, హెచ్‌వోడీలు పాల్గొన్నారు. ఈ అవార్డు సాధనలో కీలక పాత్ర పోషించిన మంత్రులు, అధికారులు, ఉద్యోగులే అసలైన విజేతలని సీఎం ఈ సందర్భంగా అభివర్ణించారు. ఈ కార్యక్రమానికి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సమన్వయకర్తగా వ్యవహరించారు. సమావేశ ప్రాంగణానికి సీఎం చంద్రబాబు చేరుకోగానే మంత్రులు, అధికారులు చప్పట్లతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ విందుకు మంత్రులు, ఉన్నతాధికారులతో పాటు, క్షేత్ర స్థాయిలో ఉత్తమ పనితీరు కనబరిచిన జిల్లా, మండల స్థాయి ఉద్యోగులను కూడా ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ఆహ్వానించడం విశేషం. ఈ పురస్కారం రావడానికి ‘టీమ్ ఏపీ’ సమష్టి కృషే కారణమని చంద్రబాబు అన్నారు. ప్రభుత్వ యంత్రాంగం అంకితభావంతో పనిచేయడం వల్లే ఈ గుర్తింపు సాధ్యమైందని, ఈ విజయాన్ని అందరితో కలిసి పంచుకోవడానికే ఈ కార్యక్రమం ఏర్పాటు చేశానని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాటాడుతూ, సంస్కరణలు అనేవి ముఖ్యమంత్రి చంద్రబాబు డీఎన్‌ఏలోనే ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్, ఓపెన్ స్కై పాలసీ, టెలికాం, ఐటీ, డ్రిప్ ఇరిగేషన్, పీపీపీ వంటి ఎన్నో రంగాల్లో ఆయన ముందుచూపుతో సంస్కరణలు తీసుకొచ్చారని గుర్తుచేశారు. రాష్ట్ర విభజన అనంతరం, గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం ఎదుర్కొన్న సవాళ్లను కూడా ఆయన ప్రస్తావించారు. విందు కార్యక్రమానికి ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులు, ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో రానున్న రోజుల్లో ప్రభుత్వం చేపట్టాల్సిన కార్యక్రమాలు, నిర్దేశించుకోవాల్సిన లక్ష్యాలు, అనుసరించాల్సిన వ్యూహాలు, విధానాలపై విస్తృతంగా చర్చించారు. పరిపాలనలో మరింత వేగం పెంచి, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంపై ఈ సమావేశంలో ప్రధానంగా దృష్టి సారించినట్టు సమాచారం.

# ఏపీ, తెలంగాణకు 3 రోజుల పాటు వర్ష సూచన

- ఉపరితల ద్రోణి ప్రభావంతో
- తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం
- తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ
- ఉరుములు మెరుపులతో వానలు పడతాయని హెచ్చరిక



హైదరాబాద్: భానుడి భగభగలతో అల్లాడిపోతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ చల్లటి కబురు అందించింది. ఉపరితల ద్రోణి ప్రభావంతో రాబోయే మూడు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. ప్రస్తుతం దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా మున్నార్ గల్ఫ్ వరకు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఈ ద్రోణి విస్తరించి ఉన్నట్టు వెల్లడించింది. ఈ వాతావరణ మార్పుల వల్ల గురువారం నుంచి శనివారం వరకు రెండు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడే

(మిగతా 2వ పేజీలో)



# అత్యాచార బాధితులకు మరింత రక్షణ

- గర్భవిచ్ఛిత్తి చట్టంలో మార్పులు అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయం
- 20 వారాల తర్వాత కూడా గర్భస్రావానికి అవకాశం కల్పించాలని సూచన
- బాధిత మహిళల శారీరక స్వేచ్ఛను గౌరవించాలన్న ధర్మాసనం

న్యూఢిల్లీ, మే 1: అత్యాచార బాధితులను అవాంఛిత గర్భాన్ని కొనసాగించే పరిస్థితికి నెట్టివేయలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. గర్భధారణ 20 వారాలు దాటిన తరువాత కూడా ప్రత్యేక పరిస్థితుల్లో గర్భవిచ్ఛిత్తికి అనుమతి ఇచ్చేలా చట్టంలో సవరణలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. బాధిత మహిళల శరీరంపై వారికి ఉన్న స్వయం నిర్ణయాధికారాన్ని గుర్తించాల్సిన అవసరం ఉందని ప్రధాన న్యాయమూర్తి (మిగతా 2వ పేజీలో)

# మే చివరికల్లా డబుల్ ఇళ్ల పంపిణీ

- పెండింగ్ గృహాలకు వేగం పెంచాలని అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం
- కాలనీల అభివృద్ధికి రూ.400 కోట్ల ప్రత్యేక నిధులు.. ఆక్రమణలపై కఠిన చర్యలు
- కొత్త రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధం కాదని స్పష్టం
- లబ్ధిదారుల ఎంపికలో ఎమ్మెల్యేల భాగస్వామ్యానికి ప్రాధాన్యం




హైదరాబాద్, మే 1: రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణం పూర్తికాక నిలిచిపోయిన రెండు పడక గదుల గృహాల పంపిణీ ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. పనులు చివరి దశలో ఉన్న గృహాలను వేగంగా పూర్తి చేసి అర్హులైన కుటుంబాలకు అప్పగించాలన్నారు. అసంపూర్తిగా మిగిలిన ఇళ్లకు ఇప్పటికే చేసిన వ్యయాన్ని మినహాయించి మిగతా నిధులను ఇందిరమ్మ గృహ పథకం ద్వారా విడుదల చేస్తామని తెలిపారు. కాంట్రాక్టర్లు పనులు మధ్యలో వదిలేసిన చోట లబ్ధిదారులే నిర్మాణం పూర్తి చేసుకునేలా అవకాశం కల్పించనున్నట్టు

(మిగతా 2వ పేజీలో)

# కవిత పార్టీకి 'తెలంగాణ రక్షణ సేన' పేరు!



కవిత ఇటీవల ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించారు. ఈ సందర్భంగా పార్టీ పేరుగా ఐదు ప్రత్యామ్నాయాలను ప్రతిపాదించారు. వాటిలో 'తెలంగాణ రక్షణ సేన' పేరుకు ప్రాథమిక స్థాయిలో అనుమతి లభించడంతో తదుపరి ప్రక్రియ ప్రారం భమైంది. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం రెండు జాతీయ, రెండు ప్రాంతీయ పత్రికల్లో వరుసగా రెండు రోజు లపాటు ప్రజా నోటీసు ప్రచురించాల్సి ఉంటుంది. ప్రతి పాదిత పేరుపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే 30 రోజు లలోగా తెలియజేయవచ్చని నోటీసులో పేర్కొనాలి. ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలను పరిశీలించిన తర్వాతే పార్టీ పేరుకు తుది ఆమోదం లభించనుంది. అనంతరం పార్టీ రా జ్యాంగం, నిబంధనలతో కూడిన పూర్తి దరఖాస్తును ఎన్నికల సంఘానికి సమర్పించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్త యిన తర్వాతే అధికారికంగా పార్టీ నమోదు ముందుకు సాగ నుంది. ఇదిలా ఉండగా, ఇటీవల నిర్వహించిన సమా వేశంలో కవిత తన కొత్త రాజకీయ వేదికకు 'తెలంగాణ రాష్ట్ర సేన' అని పేరు ప్రకటించారు. అయితే ఎన్నికల సంఘం అనుమతించిన పేర్లలో 'తెలంగాణ రక్షణ సేన' మూడో ప్రాధాన్యతగా ఉండటం విశేషంగా మారింది. దీనిపై స్పందించిన కవిత.. 'టీఆర్ఎస్ నాకు రాసిపెట్టి ఉందేమో' అంటూ సామాజిక మాధ్యమాల్లో వ్యాఖ్యానించారు. దీంతో తెలంగాణ రాజకీయాల్లో 'టీఆర్ఎస్' సంక్షిప్త నామం మరోసారి చర్చనీయాంశమైంది. అయితే ఈ పేరుపై ఇప్పటికే అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. 'తెలంగాణ రాజ్యాధికార సమితి' పేరుతో తమ పార్టీ కొనసాగుతోందని, అదే సంక్షిప్త రూపాన్ని పోలి ఉండే మరో పార్టీ పేరుకు అనుమతి ఇవ్వొద్దని ఆ పార్టీ నాయకత్వం ఎన్నికల సంఘానికి లేఖ రాసింది. మరోవైపు గతంలో తెలంగాణ రాష్ట్ర సమితిగా ఉన్న పార్టీ పేరును తిరిగి తీసుకురావాలని భావిస్తున్నట్లు బీఆర్ఎస్ వర్గాలు సంకేతాలు ఇస్తుండటం రాజకీయంగా ఆసక్తి రేపుతోంది. అభ్యంతరాల గడువు ముగిసేలోపు ఎలాంటి పెద్ద వివాదాలు తలెత్తకపోతే 'తెలంగాణ రక్షణ సేన' పేరుతో పార్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగంగా ముందుకు సాగే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# మే చివరికల్లా డబుల్ ఇళ్ల పంపిణీ




చెప్పారు. హైదరాబాద్‌లోని హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఉమ్మడి మెదక్, కరీంనగర్ జిల్లాల ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో కలిసి మంత్రి పరిస్థితిని సమీక్షించారు. మంత్రులు దామోదర్ రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు, కలెక్టర్లు సమావేశంలో పాల్గొన్నారు. ఇళ్ల కేటాయింపులో అక్రమాలకు తావులేకుండా చూడాలని మంత్రి స్పష్టం చేశారు. అర్హత లేని వ్యక్తులు ఆక్రమించిన గృహాలను వెంటనే ఖాళీ చేయించి నిజమైన లబ్ధిదారులకు అప్పగించాలని అధికారులను ఆదేశించారు. ఎంపిక ప్రక్రియలో స్థానిక ఎమ్మెల్యేలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. కాలనీల్లో తాగునీరు, రహదారులు, విద్యుత్తు, డ్రైనేజీ వంటి సదుపాయాల కోసం రూ.400 కోట్లతో ప్రత్యేక మౌలిక వసతుల కార్యక్రమం చేపడుతున్నట్లు వెల్లడించారు. బిల్లుల చెల్లింపుల్లో అవకతవకలకు పాల్పడితే సంబంధిత అధికారులపై సస్పెన్షన్‌తో పాటు ఉద్యోగాల తొలగింపు వరకు చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇందిరమ్మ గృహాల నిర్మాణంలో తొలి విడతలో ముందుకు రాని లబ్ధిదారుల స్థానంలో కొత్త అర్హులను ఎంపిక చేయాలని కలెక్టర్లకు సూచించారు. ప్రతి ఇంటి నిర్మాణానికి 40 టన్నుల ఇసుకను ఉచితంగా అందిస్తున్నామని, దాని దుర్వినియోగాన్ని అరికట్టాలని పేర్కొన్నారు. నగర శివార్లలో నిర్మించిన కాలనీల్లో నివాసం ఉండకుండా ఇళ్లను అద్దెకు ఇచ్చే వారిని గుర్తించి, వారికి నగరానికి సమీప ప్రాంతాల్లోనే గృహాలు కేటాయించే అంశంపై ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలను అడ్డుకునేందుకు జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించాలని మంత్రి దిశానిర్దేశం చేశారు. రెవెన్యూ, అటవీ భూముల సరిహద్దు వివాదాలకు ముగింపు పలకడానికి సంయుక్త సర్వేలు చేపట్టాలని సూచించారు. కొత్తగా రెవెన్యూ డివిజన్లు లేదా మండలాల ఏర్పాటు అంశం ప్రభుత్వ పరిశీలనలో లేదని స్పష్టం చేశారు. సమావేశం అనంతరం హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 30 కిలోవాట్ల సామర్థ్యంతో కూడిన సోలార్ రూఫ్‌టాప్ విద్యుత్ ప్లాంట్‌ను మంత్రి ప్రారంభించారు. దీని ద్వారా నెలకు వేల యూనిట్ల విద్యుత్ ఆదా అవుతుందని అధికారులు వివరించారు.



## మైక్రోఫైనాన్స్ కేసులో సంచలనం... మంగ్లీ సోదరుడి ఖాతాకు డబ్బులు!

**శివచౌహాన్ ఖాతాలను పరిశీలించగా 3సార్లు డబ్బులు వచ్చినట్లు గుర్తింపు**

**రమావత్ మధు బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు వచ్చినట్లు గుర్తింపు**

**నిందితుల బ్యాంకు ఖాతా వివరాలను కోరుతూ పోలీసుల లేఖ**

గాయని మంగ్లీ ఆరోపణలు ఎదుర్కొంటున్న మైక్రో ఫైనాన్స్ కేసులో సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. ఈ కేసు విచారణలో భాగంగా మంగ్లీ సోదరుడు శివచౌహాన్ బ్యాంకు ఖాతాలను పోలీసులు పరిశీలించగా, మూడుసార్లు డబ్బులు వచ్చినట్లు గుర్తించారు. రమావత్ మధు బ్యాంకు ఖాతా నుంచి శివ అకౌంట్‌కు పెద్ద మొత్తంలో డబ్బులు వచ్చాయని తెలిపారు. దీనితో రమావత్ మధు బ్యాంకు ఖాతాను పోలీసులు జప్తు చేశారు. మధు, హిమకాంత్ రెడ్డి, శివ చౌహాన్‌ల బ్యాంకు ఖాతా వివరాలను అందజేయాలని బ్యాంకులకు పోలీసులు లేఖ రాశారు. మైక్రో ఫైనాన్స్ పేరిట అధిక లాభాలు వస్తాయని నమ్మించి మంగ్లీ, ఆమె సోదరుడు, మరికొంతమంది కలిసి కోట్లాది రూపాయలు మోసం చేశారని సికింద్రాబాద్‌కు చెందిన న్యాయవాది సుబ్బారావు ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలపై తాను మంగ్లీని సంప్రదించే ప్రయత్నం చేయగా ఆమె బెదిరింపులకు పాల్పడిందని చెబుతూ పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనితో మంగ్లీ, ఆమె సోదరుడితో పాటు మరో ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు, తన పేరును ఉపయోగించుకుని సుబ్బారావు ప్రాచుర్యం పొందాలని చూస్తున్నారని ఆరోపిస్తూ మంగ్లీ కూడా ఫిర్యాదు చేశారు.

### మోదీ హైదరాబాద్ పర్యటన.. కీలక విషయాలను వెల్లడించిన కిషన్‌రెడ్డి

తెలంగాణ అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ మే 10వ తేదీన తెలంగాణలో పర్యటించనున్నట్లు ఆయన మీడియాకు తెలియజేశారు. ప్రధానిగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత మోదీ తొలిసారిగా తెలంగాణకు రానుండటంతో... ఈ పర్యటనపై అటు రాజకీయంగా, ఇటు పాలనాపరంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ పర్యటనలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రూ.7,823 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు ప్రధాని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారని కిషన్ రెడ్డి తెలిపారు. ముఖ్యంగా తెలంగాణలో రైల్వే వ్యవస్థను బలోపేతం చేసేందుకు కేంద్రం కట్టుబడి ఉందని, ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు రూ. 85 వేల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని వెల్లడించారు. హైదరాబాద్ నుంచి యాదగిరిగుట్ట వరకు ఎంఎంటీఎస్ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని కిషన్ రెడ్డి తెలిపారు. అలాగే, ములుగులో ఏర్పాటు చేయనున్న సమ్మక్క – సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ క్యాంపస్ నిర్మాణ పనులు కూడా త్వరలోనే పట్టాలెక్కనున్నాయని వెల్లడించారు. వరంగల్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ప్రధాన మంత్రి కాకతీయ టెక్స్‌టైల్ పార్కు'ను వేగంగా అభివృద్ధి చేస్తున్నామని కిషన్ రెడ్డి తెలిపారు. దేశవ్యాప్తంగా మంజూరైన ఏడు మెగా టెక్స్‌టైల్ పార్కుల్లో ఇది ఒకటని చెప్పారు. ఈ పార్కు రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి వెన్నెముకగా నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు, ప్రధాని పర్యటన సందర్భంగా హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సభకు 3 లక్షల మందిని తరలించాలని రాష్ట్ర బీజేపీ నాయకత్వం భావిస్తోంది.

### భార్య వివాహేతర సంబంధం కారణంగానే
## హుస్సేన్‌సాగర్‌లో దూకి టెక్కీ ఆత్మహత్య

**ఫిబ్రవరి మొదటి వారంలో ఆత్మహత్య చేసుకున్న సీతారామ్ రెడ్డి**

**కోడలి వివాహేతర సంబంధమే కారణమని సీతారామ్ రెడ్డి తండ్రి ఆరోపణ**

**భార్యతో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు**

హైదరాబాద్ నగరంలో సీతారామ్ రెడ్డి ఆత్మహత్య కేసులో సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తన ఆత్మహత్యకు భార్య కారణమని ఆయన అందులో ఆరోపించారు. ఆయన ఫిబ్రవరి మొదటి వారంలో హుస్సేన్ సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. తాజాగా, 19 పేజీల సూసైడ్ నోట్ పోలీసులకు లభ్యమైంది. తన కుమారుడి మృతికి కోడలి వివాహేతర సంబంధమే కారణమని సీతారామ్ రెడ్డి తండ్రి ఆరోపించారు. సీతారామ్ రెడ్డి భార్యకు వివాహేతర సంబంధం ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఆమె దారుణాలు చూడలేక భర్త ఆత్మహత్య చేసుకున్నాడని తెలుస్తోంది. సీతారామ్ రెడ్డిది ఏపీలోని మార్కాపురం కాగా, భార్యది నంద్యాల. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సీతారామ్ రెడ్డి టెక్కీగా పనిచేస్తున్నారు. వీరి కుటుంబం బాచుపల్లిలో నివసిస్తోంది. భార్య గురించి తెలియడంతో, తీవ్ర మనస్తాపానికి గురైన సీతారామ్ రెడ్డి ఫిబ్రవరిలో 19 పేజీల సూసైడ్ లేఖ రాసి హుస్సేన్ సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ కేసులో పోలీసులు భార్యతో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేశారు.

### డీజీపీగా పదవీ విరమణ చేసిన వెంటనే..
## శివధర్‌రెడ్డికి కీలక బాధ్యతలను అప్పగించిన ప్రభుత్వం

డీజీపీగా నేడు పదవీ విరమణ చేసిన శివధర్ రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వ భద్రతా సలహాదారుగా నియామకం

చీఫ్ సెక్రటరీ హోదాలో కీలక పదవి

నెలకు రూ. 2.25 లక్షల వేతనం, ప్రత్యేక కార్యాలయం



తెలంగాణ డీజీపీ బి. శివధర్ రెడ్డి ఈరోజు పదవీ విరమణ పొందిన సంగతి తెలిసిందే. పదవీ విరమణ పొందిన వెంటనే తెలంగాణ ప్రభుత్వం ఆయనకు కీలక బాధ్యతలను అప్పగించింది. రాష్ట్ర ప్రభుత్వ భద్రతా సలహాదారుగా ఆయనను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన సేవలు రాష్ట్రానికి మరింత కాలం అవసరమని ప్రభుత్వం భావించినట్లు ఈ నిర్ణయం ద్వారా స్పష్టమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వ భద్రతా సలహాదారుగా శివధర్ రెడ్డిని చీఫ్ సెక్రటరీ (సీఎస్) హోదాతో ఈ పదవిలో నియమించారు. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మూడేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. శాంతిభద్రతల పరిరక్షణ, అంతర్గత భద్రత, నేర నియంత్రణతో పాటు ప్రస్తుతం రాష్ట్రం ఎదుర్కొంటున్న ప్రధాన సవాలు అయిన నార్కోటిక్స్ కంట్రోల్ (డ్రగ్స్ నియంత్రణ), రోడ్డు భద్రత వంటి అంశాలపై ఆయన ప్రభుత్వానికి నేరుగా సలహాలు అందించనున్నారు.

**వేతన సదుపాయాలు, కార్యాలయం:**

వేతనం: నెలకు రూ. 2.25 లక్షల వేతనంతో పాటు రూ. 50,000 ఇంటి అద్దె భత్యం.

సౌకర్యాలు: ప్రభుత్వ వాహనం, టీఏ/డీఏ, మెడికల్ రీయింబర్స్‌మెంట్ సౌకర్యాలు ఆయనకు లభిస్తాయి. సిబ్బంది: హోంశాఖ ఆయన కోసం ఒక ఓఎస్‌డీ, ప్రైవేట్ సెక్రటరీ, ఇద్దరు డ్రైవర్లు, నలుగురు ఆఫీస్ సబార్డినేట్లతో కూడిన ప్రత్యేక కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది.



## శ్రీకరి మహాసన హైస్కూల్ తొలి బ్యాచ్‌కు ఘన విజయం.. పదో తరగతిలో 100% ఉత్తీర్ణత

సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఏప్రిల్ 30 : బ్రహ్మపురి కాలనీలోని శ్రీకరి మహాసన హైస్కూల్ 2025--26 విద్యా సంవత్సరానికి చెందిన 10వ తరగతి తొలి బ్యాచ్ విశిష్ట ఫలితాలతో మెరిసింది. పరీక్షలకు హాజరైన విద్యార్థులందరూ వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించడం గర్వకారణంగా నిలిచింది.ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ ఎన్. సాయిబాబా, మేనేజ్‌మెంట్ సభ్యులు సుచిత్ర రేఖ, పద్మజా రేఖ, గిరిజా రమణి, వైస్ చైర్మన్ ఎన్. పుష్పలత, ప్రిన్సిపాల్ సుష్మా సింగ్ విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఈ విజయాన్ని సాధించారని వారు పేర్కొన్నారు.పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు విలువలతో కూడిన బోధన అందిస్తున్నామని, భవిష్యత్తులో కూడా ఇలాంటి ఉత్తమ ఫలితాలు కొనసాగుతాయని మేనేజ్‌మెంట్ విశ్వాసం వ్యక్తం చేసింది. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల సహకారం విద్యార్థుల విజయానికి ప్రధాన కారణమని స్కూల్ యాజమాన్యం తెలిపింది.

## రాష్ట్ర సేన నుంచి రక్షణ సేనగా మార్పు

తెలంగాణ రాష్ట్ర సమితి పెట్టుకునే ఉంటే అనుమతి వచ్చేది కాదేమో కానీ ఆమె తెలంగాణ రాష్ట్ర సేన అని తెలివిగా ఇంగ్లీష్‌లో టీఆర్ఎస్ అని వచ్చేలా పేరును డిజైన్ చేశారు.పార్టీకి ఈసీ గుర్తించడంపై ఆనందం వ్యక్తం చేసిన కవిత టీఆర్ఎస్ నాకు రాసి పెట్టిందేమో అని కామెంట్ చేశారు. "తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) కు కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదం తెలిపిందని సమస్త తెలంగాణ సమాజానికి తెలియ చేయడానికి సంతోషిస్తున్నాము రెండు దశాబ్దాలుగా తెలంగాణ సాంస్కృతిక పరిరక్షణ, పునరుజ్జీవం కోసం నేను చేసిన కృషిని కొనసాగిస్తూ, ఇక ముందు కూడా తెలంగాణ అస్తిత్వ పరిరక్షణే ధ్యేయంగా అంకితభావంతో పని చేస్తానని తెలియజేస్తున్నాను. జనవరి 2026 లో జాతీయ ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ఐదు పేర్లతో దరఖాస్తు చేసుకున్నాం. అందులో మూడవ ప్రాధాన్యత గా మేము ఇచ్చిన పేరును ఈసీ ఆమోదించడం కేవలం యాదృచ్ఛికం. ౹ె౹ూ నాకు రాసిపెట్టుందేమో" అని వెల్లడించారు. జనవరిలో పార్టీ కోసం కవిత దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో తెలంగాణ ప్రజా జాగృతి, తెలంగాణ జాగృతి, తెలంగాణ రక్షణ సేన, తెలంగాణ రాష్ట్ర జాగృతి, తెలంగామ ప్రజాశక్తి పేరుతో పార్టీకి పెట్టుకునేందుకు అనుమతి ఇవ్వాలని ఈసీకి విజప్తి చేశారు. అయితే మొన్నటి వరకు వీటిలో దేనికి కూడా ఆమోదం రాకపోయేసరికి మంచి ముహూర్తం ఉందని టీఆర్ఎస్ పేరుతో వస్తున్నట్టు ప్రకటించారు. కానీ ఇప్పుడు ఈసీ ఆమె ఇచ్చిన ఐదు ఆప్షన్స్‌లో తెలంగాణ సేనకు అంగీకారం తెలిపింది. ఆమె అనుకున్నట్టుగానే టీఆర్ఎస్ కలిసి రావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## యాక్షన్ మోడ్‌లోకి కేటీఆర్

సూచించారు. అదేవిధంగా రాబోయే ఎన్నికలపైనా కేటీఆర్ ముందస్తుగానే సమీక్షలు నిర్వహించారు. ఏయే నియోజకవర్గాల్లో ఏమేరకు సానుకూలత ఉందన్న విషయాన్ని ఆరా తీశారు. ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకువె ళ్లాలని ఆయన సూచించారు. ప్రజల మధ్య ఉండే నాయకులే గుర్తింపు ఉంటుందని తేల్చేశారు. తన సోదరి కవిత రాజకీయాలు.. ఆమె పెట్టుకున్న టీఆర్ ఎస్ పార్టీపైనా కేటీఆర్ నర్మగర్భంగా మాట్లాడారు. కొత్త పార్టీ అని పిలుస్తూ.. --కొత్త పార్టీలపై ఎవరూ స్పందించొద్దు. సమయం, సందర్భం చూసుకుని కేసీఆర్ సర్ స్పందిస్తారు. అప్పటి వరకు ఓపికగా ఉండండి. ఎన్ని పార్టీలు వచ్చినా.. కేసీఆర్ నాయకత్వాన్నే ప్రజలు కోరుకుంటున్నారు. ఈ విషయంలో రెచ్చగొట్టే వ్యాఖ్యల విషయంలో మీరు అప్రమత్తంగా ఉండండి- అని నాయకులకు తేల్చి చెప్పారు. త్వరలోనే జిల్లాలు, మండలాల వారీగా కొత్త కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు.

## బీజేపీ టార్గెట్ తెలంగాణ

ప్రజల్లోకి తీసుకెళ్లనున్నారు.ప్రధాని మోదీ నిర్వహించబోయే జనాగ్రహ సభ కేవలం ఒక సాధారణ బహిరంగ సభ మాత్రమే కాదు. కాంగ్రెస్ ప్రస్తుతం ఎదుర్కొంటున్న అంతర్గత సంక్షోభం, బీఆర్ఎస్‌లో వినిపిస్తున్న అసమ్మతి స్వరాలను తమ వైపు తిప్పుకోవడానికి ఇదొక వేదిక కానుంది. తెలంగాణలో బీఆర్ఎస్‌కు అసలైన ప్రత్యామ్నాయం బీజేపీనే అనే బలమైన ముద్రను వేయడానికి మోదీ ఈ వేదికపై నుంచి కీలక ప్రకటనలు చేసే అవకాశం ఉంది. ఈ సభ ద్వారా అటు అధికార పక్షాన్ని, ఇటు కాంగ్రెస్‌ను ఏకకాలంలో ఇరకాటంలోకి నెట్టాలన్నది కాషాయ వ్యూహం. తెలంగాణ బీజేపీ నేతలు సైతం ఈ పర్యటనపై భారీ ఆశలు పెట్టుకున్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే మోదీ రాకతో రాష్ట్రవ్యాప్తంగా భారీ చేరికలకు ప్లాన్ చేస్తున్నారు. ఇతర పార్టీల్లోని అసంతృప్త నేతలకు బీజేపీలో చేరడానికి మోదీ సభ ఒక ముహూర్తం గా మారుతుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బెంగాల్ ఫలితాలు అనుకూలంగా వస్తే, తెలంగాణలో బీజేపీ నేతల దూకుడుకు అడ్డుకట్ట వేయడం ఎవరికీ సాధ్యం కాదన్న భావన రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. బీజేపీ తన రెండో గేరును మార్చి వేగంగా ముందుకు దూసుకెళ్లడానికి సిద్ధమైంది. ఐదు రాష్ట్రాల ఫలితాలు ఇచ్చే బూస్ట్‌తో మోదీ జనాగ్రహం ద్వారా తెలంగాణలో రాజకీయ సమీకరణాలను మార్చేయాలని చూస్తోంది. ఈ పర్యటన తర్వాత రాష్ట్ర రాజకీయాలు కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ అన్నట్లుగా మారుతాయా లేదా అన్నది మే మొదటి వారంలో తేలనుంది.

### విత్తన కంపెనీ ప్రతినిధులతో మంత్రి తుమ్మల సమీక్ష

**నాణ్యమైన విత్తనాలనే రైతులకు అందుబాటులో ఉంచాలి**

**నకిలీ విత్తనాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలి**

హైదరాబాద్ : రోజు సచివాలయంలో వ్యవసాయశాఖ, సీడ్ డెవలప్మెంట్ కార్పోరేషన్ మరియు విత్తన కంపెనీ ప్రతినిధులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష నిర్వహించారు. వానాకాలం (ఖరీఫ్) 2026 సాగు సన్నాహకంలో భాగంగా, వచ్చే ఖరీఫ్ సీజన్కు సంబంధించి విత్తనాల లభ్యతను కంపెనీల వారీగా, పంటల వారీగా సమీక్షించారు. రైతులకు నాణ్యమైన, అధిక దిగుబడి ఇచ్చే విత్తనాలే అందుబాటులో ఉంచాలని మంత్రి స్పష్టం చేశారు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వానాకాలం 2026లో రాష్ట్రంలో సుమారు 134.66 లక్షల ఎకరాల్లో సాగు జరిగే అవకాశముండగా, దానికి 19.42 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరం అవుతాయని అంచనా. ప్రస్తుతం రాష్ట్రంలో 38.21 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, అవసరానికి దాదాపు రెండింతలు నిల్వలు సిద్ధంగా ఉన్నాయని మంత్రి తెలిపారు. పత్తి సాగు విషయంలో సుమారు 52 లక్షల ఎకరాల లక్ష్యంతో, రైతులకు అవసరమైన 104 లక్షల ప్యాకెట్లకు బదులుగా 212.11 లక్షల ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని అధికారులు వివరించారు. గత సంవత్సరం వినియోగంతో పోలిస్తే ఈ సంవత్సరం అధిక నిల్వలు రైతులకు విశ్వాసాన్ని కలిగిస్తాయని మంత్రి పేర్కొన్నారు. హైబ్రిడ్ విత్తనాల లభ్యతపై ప్రత్యేకంగా చర్చిస్తూ, రైతుల అవసరాలకు అనుగుణంగా మార్కెట్లో డిమాండ్ ఉన్న విత్తనాలను ప్రాధాన్యంగా సరఫరా చేయాలని మంత్రి సూచించారు.



## కుషాయిగూడ లో అన్నదాన కార్యక్రమం

కాప్రా, వార్త మిర్రర్, ఏప్రిల్ 30

శ్రీఆంజనేయస్వామి వైభవ విగ్రహ ఆవిష్కరణ మహోత్సవం భాగంగా విచ్చేసిన భక్తులకు తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఆధ్వర్యంలో వాసవి మిత్రమండలి, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా నేతృత్వంలో దాతల సహకారంతో ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కల్వ సుజాత గుప్త హాజరయ్యారు .ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని సేవలు అందించారు



## చర్లపల్లి ఐజీ కాలనీ సమస్యలపై ఎమ్మెల్యే పాదయాత్ర

కాప్రా, వార్తా మిర్రర్ ,ఏప్రిల్ 30 : చర్లపల్లి ఐ జి కాలనీలో నివసిస్తున్న ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే బండర్ లక్ష్మారెడ్డి కాలనీలో అధికారులతో కలిసి పర్యటించారు. పైకప్పుల లీకేజీలు, డ్రైనేజ్ సమస్యలు, భవనాల స్లాబ్ పగుళ్లు వంటి తీవ్రమైన ఇబ్బందులను ఆయన గత అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లారు. కాలనీ వాసులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.కాలనీలోని మౌలిక సదుపాయాల మెరుగుదలకు అవసరమైన చర్యలు తీసుకుంటామని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా శాశ్వత పరిష్కారం కల్పించేందుకు కృషి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.





## కుషాయిగూడలో ఘనంగా ఔషదీ యుక్త మహా స్నాపనం

కాప్రా, వార్తా మిర్రర్,ఏప్రిల్ 30 : కుషాయిగూడలో శుక్రవారం 54 అడుగుల భారీ హనుమాన్ విగ్రహం ప్రతిష్టాపన మహోత్సవంలో భాగంగా గురువారం ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. స్థాపిత దేవతార్చన, స్థాపిత దేవత (మన్యు సూక్త) హోమాలు, ఔషదీ యుక్త మహా స్నాపనం, ధ్యానాది వాసం, హారతి, సుదర్శన హోమం కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో సుమారు 19 జంటలు భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో.. వాసవి మిత్రమండలి నేతృత్వంలో భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు ఆంజనేయ స్వామి మాలలు ధరించి నిష్ఠతో పూజలు నిర్వహించారు.



## బంగారు మైసమ్మ అమ్మవారి ఆలయంకి విరాళం

కాప్రా, వార్త మిర్రర్, ఏప్రిల్ 30 : మీర్పేట్ హెచ్ బి కాలనీ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ కాలనీలో శ్రీ శ్రీ శ్రీ బంగారు మైసమ్మ అమ్మవారి దేవాలయ అభివృద్ధికి బిఆర్ఎస్ పార్టీ నాయకులు వంజరి ప్రవీణ్ కరిపే ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పదివేల రూపాయల విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జెరిపోతుల ప్రభుదాస్, గుండారపు శ్రీనివాస్ రెడ్డి, విగ్రహ దాత పాతకోటి ఉమా శ్రీనివాస్ దంపతులు, ఆలయ అర్చకులు,కాలనీ అధ్యక్షులు వాసుచారి, సెక్రటరీ మధు ముదిరాజ్, శ్రీకాంత్ గౌడ్, అరుణ్, అబ్బగోని శంకర్ గౌడ్, భీష్మచారి, బాలచారి, శ్రీనివాస్ చారి, బండి యాదయ్య, అజయ్ ఆనంద్, శ్రీనివాస్, కర్నె శ్రీనివాస్, రమేష్, సోములు, క్రాంతి, రాములు, వీరస్వామి, భాగ్యలక్ష్మీ, లత, మాధవి, శైలజ, కర్నె భాగ్యలక్ష్మీ, రజిని తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో పెరిగిన 'టావర్' సర్జరీలు.....

### గతేడాదితో పోలిస్తే 34 శాతం వృద్ధి....





కొండాపూర్ వార్త మిర్రర్ : నగరంలో తక్కువ కోతతో చేసే అధునాతన గుండె శస్త్రచికిత్సలు గతేడాదితో పోలిస్తే 34 శాతం పెరిగాయి. ముఖ్యంగా 60 ఏళ్లు పైబడిన వారిలో గుండె ప్రధాన కవాటం ఇరుకుగా మారే అయోర్టిక్ స్టెనోసిస్ సమస్యకు ట్రాన్స్‌క్యాథెటర్ అయోర్టిక్ వాల్వ్ రీప్లేస్‌మెంట్ (టావర్) చికిత్స విధానం ప్రాధాన్యం సంతరించుకుంది. హైదరాబాద్‌లో ప్రస్తుతం ఏటా 350 నుంచి 400 వరకు టావర్ సర్జరీలు జరుగుతున్నాయి. ఆయాసం, అలసట, ఛాతీలో అసౌకర్యం వంటి లక్షణాలను వృద్ధాప్య సమస్యలుగా భావించి నిర్లక్ష్యం చేయరాదని ఏఐజీ హాస్పిటల్స్ కార్డియాక్ క్యాత్ ల్యాబ్ డైరెక్టర్, ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ అనుజ్ కపాడియా, క్యాత్ ల్యాబ్ కో-డైరెక్టర్, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ స్వరూప్ భరడి సూచించారు. ఆధునిక వైద్య సదుపాయాలు, నిపుణులైన వైద్య బృందాల కృషితో గతంలో శస్త్రచికిత్సకు అత్యంత ప్రమాదకరంగా భావించిన రోగులకు సైతం ఇప్పుడు టావర్ విధానం ద్వారా సురక్షితంగా వైద్యం అందిస్తున్నామని, తద్వారా రోగులు త్వరగా కోలుకుంటున్నారని వారు వివరించారు.

# కానామెట్టు చెరువు కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి....

### అధికారుల నిర్లక్ష్యం, హైడ్రా తీరుపై సీపీఐ నేతల మండిపాటు.....



మాదాపూర్ వార్త మిర్రర్ : ?మండల పరిధిలోని కానామెట్టు చెరువును కూకట్‌పల్లి సర్వే నంబర్‌తో కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర నాయకులు పానుగంటి పర్వతాలు, టీ రామకృష్ణ డిమాండ్ చేశారు. శేరిలింగంపల్లిలో కోట్లు విలువచేసే భూములపై కన్నేసిన కబ్జాదారులు లేని సర్వే నంబర్లను సృష్టించి చెరువులు, నాలాలను మాయం చేస్తుంటే అధికారులు చోద్యం చూస్తున్నారని వారు మండిపడ్డారు. పేదల గుడిసెలను రాత్రికి రాత్రే కూల్చేస్తున్న హైడ్రా అధికారులకు ధనవంతుల అక్రమ నిర్మాణాలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. హైడ్రాకు చిత్తశుద్ధి ఉంటే తక్షణమే ఆ నిర్మాణాలను కూల్చివేసి, కబ్జాదారులపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని, లేకుంటే వారితో అధికారులు కుమ్మక్కయ్యారని ప్రజలు భావిస్తారని హెచ్చరించారు. ఈ వ్యవహారంపై కలెక్టర్, హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేస్తామని, అప్పటికీ స్పందించకపోతే కోర్టు ద్వారా న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఐ నాయకులు కె.చందు యాదవ్, కె.వెంకటస్వామి, తుపాకుల రాములు, కాసిం, వెంకటేష్, జెట్టి శ్రీను, తిరుపతయ్య, కిరణ్, బాలస్వామి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి....



చందానగర్ వార్త మిర్రర్ : చందానగర్ డివిజన్ పీజేఆర్ స్టేడియంలో సీఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మర్ కోచింగ్ క్యాంప్-2026ను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, స్పోర్ట్స్ అడిషనల్ కమిషనర్ సుభద్ర, జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మాలెంపాటి, మియాపూర్ సర్కిల్ డీసీ శశిరేఖ, శేరిలింగంపల్లి సర్కిల్ డీసీ సేవా ఇస్లావత్, సీనియర్ నాయకుడు రఘునాథ్ రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ.. ఏప్రిల్ 25 నుంచి మే 31 వరకు కొనసాగే ఈ క్యాంపును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. చదువుతో పాటు శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. గతంలో సీఎంసీ క్యాంపుల్లో శిక్షణ పొందిన పుల్లెల గోపీచంద్, పీవీ సింధు లాంటి క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి దేశానికి పేరుతెచ్చారని, వారిని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లల్లోని నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించినప్పుడే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఎండ తీవ్రత నేపథ్యంలో చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు కనీస జాగ్రత్తలు తీసుకోవాలని, మెరుగైన మౌలిక వసతులతో శిక్షణ అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రవీందర్ రావు, నాయకులు ప్రసాద్, అక్బర్ ఖాన్, ఓ.వెంకటేష్, నరేందర్ బల్లా, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలీసు అధికారుల సేవలు వెలకట్టలేనివి: సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్....





సైబరాబాద్ వార్త మిర్రర్ : సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన ఏడు మంది పోలీసు సిబ్బందిని సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీపీ, రిటైర్ అయిన సిబ్బందికి పెన్షన్ పత్రాలు అందజేసి, పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించి ఆత్మీయంగా వీడ్కోలు పలికారు.ఈ సందర్భం గా సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ.. యూనిఫాం పోలీస్‌కు రెండో చర్మంలాంటిదని, ప్రజల కన్నీరు తుడిచి, వారికి సేవలు అందించిన ప్రతి పోలీసు అధికారి పదవీ విరమణ సమయంలో గర్వపడాలన్నారు. ప్రతి పోలీస్ అధికారి తన కుటుంబానికి రుణపడి ఉండాలన్నారు. పోలీసులు విధుల నిర్వహించే క్రమం లో వారి కుటుంబ సభ్యులు ఎన్నో త్యాగాలు చేస్తారని గుర్తు చేశారు. ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టి ప్రతిరోజూ వ్యాయామం చేయాలని, సమాజంలోని పౌరులతో సానుభూతితో, గౌరవంతో మెలగాలని సూచించారు. పదవీ విరమణ చేసిన పోలీసులు తమ అనుభవంతో పోలీస్ శాఖకు అవసరమైనప్పుడు సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్ బీ ఏడీసీపీ రవికుమార్ డీసీపీగా ప్రమోషన్ పొందినందుకు సీపీ అభినందనలు తెలిపారు. తన పదవీ విరమణ సందర్భంగా ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్ కుమార్ మాట్లాడుతూ..ప్రజలకు చేరువయ్యేందుకు పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. ఒక కానిస్టేబుల్ కుమారుడిగా కెరీర్‌ను ప్రారంభించి, నేడు డీసీపీ స్థాయికి ఎదగడం పట్ల గర్వంగా ఉందన్నారు. పోలీస్ శాఖలో శారీరక శ్రమతో పాటు 'హ్యూమన్ ఇంటెలిజెన్స్' మరియు మేధోపరమైన కృషి ఎంతో కీలకమని ఆయన స్పష్టం చేశారు. తన విజయ ప్రస్థానంలో కుటుంబ సభ్యుల తోడ్పాటు మరవలేనిదని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు.సైబరాబాద్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిలో ట్రాఫిక్ 2 డీసీపీ రంజన్ రతన్ కుమార్, ఎస్‌బీ ఎస్ఐ పి. వెంకట్ రెడ్డి, ఏఆర్ఎస్ఐ కె. మురళీధర్ సంగారెడ్డి జిల్లా అటాచ్‌మెంట్‌తో సీఏఆర్ హెడ్క్వార్టర్స్‌లో, ఏఆర్ఎస్ఐ ఎన్. కృష్ణ సీఏఆర్ హెడ్క్వార్టర్స్‌లో, ఏఎస్ఐ వి. వెంకట సూర్యనారాయణ రాజు ఈఓడబ్ల్యూ సైబరాబాద్‌లో, డి. రాములు మోకిల పోలీస్ స్టేషన్‌లో, అలాగే జి. అశోక్, బార్బర్, సీఏఆర్ హెడ్క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తూ తమ పదవీ విరమణ పొందారు. వీరి సేవలను అధికారులు అభినందిస్తూ, భవిష్యత్తులో ఆరోగ్యంగా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమం లో అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, డీసీపీ క్రైమ్స్ ముత్యం రెడ్డి, డీసీపీ స్పెషల్ బ్రాంచ్ వై.వి.ఎస్. సుధీంద్ర, సైబర్ క్రైమ్స్ డీసీపీ టి. సాయి మనోహర్, విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజన కర్ణం, ఎస్‌బి ఏడీసీపీ రవికుమార్, మరియు వివిధ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ఎస్ ఎస్ సి ఫలితాలలో నాగర్జున విద్యాసంస్థలు

### ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించిన నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ జి. విఠల్ రెడ్డి



ఎల్బీనగర్ 30 ఏప్రిల్ : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రకటించిన ఎస్ ఎస్ సి ఫలితాలలో వనస్థలిపురం నాగార్జున విద్యాసంస్థల విద్యార్థులు చక్కటి ఫలితాలను సాధించి తమ యొక్క ప్రతిభను మరోసారి చాటుకున్నారు. చక్కటి ప్రతిభను కనబరిచిన విద్యార్థులను నాగర్జున విద్యాసంస్థల చైర్మన్ జి. విఠల్ రెడ్డిలు పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులకు పూల బోకే లను అందజేసి అభినందించారు. 65 మంది విద్యార్థులు 571 పైగా మార్కులు సాధించారని, నలుగురు విద్యార్థులు 590 పైగా మార్కులు సాధించగా 580 కి పైగా 29 మంది విద్యార్థులు, 570 కి పైగా 65 మంది విద్యార్థులు 129 మంది విద్యార్థులు 560 మార్కులు సాధించారని తెలిపారు. 188 మంది విద్యార్థులు 550 పైగా మార్కులు సాధించగా 297 మంది విద్యార్థులు 540 పైగా మార్కులు సాధించారని విఠల్ రెడ్డి వెల్లడించారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల చేత చక్కటి విద్యా బోధన చేస్తూ ప్రతి సంవత్సరం పదవ తరగతి పరీక్ష ఫలితాలలో తమ విద్యార్థులు చక్కటి ప్రతిభను కనబరుస్తున్నారని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల వైస్ చైర్పర్సన్ రజిని విఠల్ రెడ్డి, సీఈఓ శేషారావు, అకాడమిక్ డీన్ రాజశేఖర్, ప్రిన్సిపాల్ ఇన్చార్జీలు ఉపాధ్యాయులు అధ్యాపక బృందం పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదం లో ఒక్కరి మృతి



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఏప్రిల్ 30

చాపల్లి రాంబాబు తండ్రి వెంకటేశ్వర్లు 31 సంవత్సరాలు చిరునామా కొండేపి గ్రామం, మండలం ప్రకాశం జిల్లా ప్రస్తుతం జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కుమ్మరుపల్లి గ్రామం, అనునతను ఆంధ్ర ప్రదేశ్ నుండి బార్య ఇద్దరు పిల్లలతో వలస వచ్చి రాయికల్ మండలంలో మేస్త్రి పనులు చేసుకుతూ జీవిస్తుంటాడు. తేదీ 30 4 2026 గురు వారం రోజున ఉదయం సుమారు 06: 30 గంటలకు కూలీలను తీసుకురావడానికి ఒక్కడే కారును నడుపుకుంటూ జగిత్యాల్ వెళ్తుండగా, మార్గమధ్యలో కుమ్మరుపల్లి శివారులో తాను నడుపుతున్న మారుతీ సుజుకి సియేజ్ కార్ నం. టిఎస్ 09 ఈజి 7468 కారును అతివేగంగా, అజాగ్రత్తగా నడిపగా కారు అదుపుతప్పి రోడ్డు ఎడమ వైపు గల పొదలలోని చెట్లకు డీ కొట్టగా కారు నుజ్జునుజ్జు అయి మృతునికి తల వెనుక భాగంలో తీవ్ర రక్త గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు అని, మృతుని భార్య చాపల్లి నాగమణి ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏ.ఎస్.ఐ సైఫుద్దీన్ తెలిపినారు.



# ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలి

### - డిఆర్డీవో రఘువరణ్

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఏప్రిల్ 30

గ్రామాల్లో చేపట్టే ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని జగిత్యాల డిఆర్డీవో రఘువరణ్ అన్నారు. గురువారం రాయికల్ మండలంలోని రాజనగర్ గ్రామంలో ఖండిత కంధకాల పనులు, గ్రామ వన నర్సరీ, గ్రామైఖ్య సంఘం భవన నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని సిబ్బందికి సూచించారు. పని ప్రదేశంలో కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం కూలీలు పనులు చేసి ప్రభుత్వం ఇస్తున్న వేతనం పొందాలన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం 6 గంటల వరకు పనుల్లోకి రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బింగి చిరంజీవి, సర్పంచ్ భారతపు రాజేష్, ఏపీవో దివ్య, టెక్నికల్ అసిస్టెంట్లు విజయ్, రాజేందర్, పంచాయతీ కార్యదర్శి వెంకటాచలం, ఫీల్డ్ అసిస్టెంట్ రాజేందర్, కూలీలు తదితరులు పాల్గొన్నారు.




# ఉపాధ్యాయుల పని తీరు అభినందనీయం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఏప్రిల్ 30 పదవ తరగతి పరీక్ష ఫలితాల సాధనలో ఉపాధ్యాయుల పని తీరు అభినందనీయమని సర్పంచి తలారి నాగమణి అన్నారు. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం మైతాపూర్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి ఫలితాలలో టాపర్లు గా నిలిచిన విద్యార్థులను సర్పంచి గురువారం సన్మానించారు. అందరు విద్యార్థులు పాస్ కావడానికి కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రణయ్, ప్రధానోపాధ్యాయులు ముక్కాల మోహన్ రెడ్డి, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ శ్యామల, నాయకుడు తలారి రాజేష్, ఉపాధ్యాయులు వేముల మధులు పాల్గొన్నారు.



# ఎస్ ఎస్ సి ఫలితాలలో 593 మార్కుల ప్రభంజనం సృష్టించిన భాష్యం స్కూల్ విద్యార్థి

ఎల్బీనగర్ 30 ఏప్రిల్ : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రకటించిన ఎస్ ఎస్ సి ఫలితాలలో వనస్థలిపురం భాష్యం పాఠశాల విద్యార్థి యు. వెంకట లిఖిత్ 593 మార్కులు సాధించి తమ యొక్క ప్రతిభను మరోసారి చాటుకున్నారు. 34 మంది విద్యార్థులు 580 కి పైగా మార్కులు సాధించారని, 59 మంది విద్యార్థులు 570 కి పైగా మార్కులు సాధించగా 210 మంది విద్యార్థులు, 550 కి పైగా మార్కులు సాధించి తమ సత్తాను చాటారని చెప్పారు. 99.2% ఫలితాలు సాధించిన భాష్యం విద్యార్థులను యజమాన్యం అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల చేత చక్కటి విద్యా బోధన చేస్తూ ప్రతి సంవత్సరం పదవ తరగతి పరీక్ష ఫలితాలలో తమ విద్యార్థులు చక్కటి ప్రతిభను కనబరుస్తున్నారని గుర్తు చేశారు. చక్కటి ఫలితాలు సాధించిన విద్యార్థులను భాష్యం విద్యాసంస్థల చైర్మన్ అశోక్ రామకృష్ణ, సీఈఓ చైతన్య, జెడ్ ఈవో అంకమరావు, ప్రిన్సిపాల్ సుజాత, ప్రిన్సిపాల్ హేమ ఉపాధ్యాయులు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# ప్రమాదభీమా చెక్కు అందజేత

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఏప్రిల్ 30

గాయత్రి బ్యాంకు రాయికల్ శాఖ యందు జరిగిన ఒక కార్యక్రమంలో గాయత్రి బ్యాంకు యొక్క ఖాతాదారులైన కటుకం లక్ష్మీకాంతం ప్రమాదవశాత్తు మరణించగా, మృతుడికి ది గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు యందు గల గాయత్రి నిర్భయ సేవింగ్ ఖాతాపై గల ప్రమాదభీమా సౌకర్యం ద్వారా నామిని అతని భార్య కటుకం మాధవి కు 1లక్ష రూపాయల చెక్కును రాయికల్ ఎమ్.పి.డి.ఓ. శ్రీ బి.చిరంజీవి చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్.పి.డి.ఓ. శ్రీ బి.చిరంజీవి మాట్లాడుతూ మద్యతరగతి వ్యాపార, ఉద్యోగ వర్గ ప్రజలకు గాయత్రి బ్యాంకు వారు ఋణాలను ఇస్తున్నారని, నామమాత్రపు చార్జీలతో లక్ష రూపాయల ప్రమాద భీమా ద్వారా ఖాతాదారుల కుటుంబాలకు తమ వంతు బాధ్యతని నిర్వర్తించగలుగుతున్నారని అన్నారు. వినియోగదారులకు 24 గంటలు ఎ టీ ఏం లలో నగదు అందుబాటులో ఉంచడం ద్వారా రాయికల్, పరిసర ప్రాంత ప్రజల నగదు అవసరాలను తీరుస్తున్నామని అన్నారు. అనంతరం బ్రాంచి మేనేజర్ ఎస్.మధు మాట్లాడుతూ మైక్రో ఎటిఎం సేవల ద్వారా వినియోగదారులకు చెల్లింపులు చేయడం జరుగుతుంది. వినియోగదారులకు ఈ కెవైసిద్వారా ఖాతాలను ఓపెన్ చేయడం జరుగుతుంది. కేవలం 0.90% సాలుసరి వడ్డీకే బంగారు ఆభరణాలపై గ్రాముకు అత్యధికంగా రూ॥ 8,600/- తో ఋణాలను అందిస్తున్నారని, అలాగే రైతులకు వ్యవసాయ రుణాలను కూడా అందిస్తున్నారని తెలియజేశారు. బ్యాంకు యొక్క (కస్టమర్ సర్వీస్ పాయింట్) బ్యాంకింగ్ కరస్పాండెంట్ని నియమించి వినియోగదారుల చెంతకు బ్యాంకు సేవలను తీసుకువచ్చారని తెలియజేశారు.




సేవింగ్ ఖాతాలు ప్రారంభించుటకు కావలసిన ఫోటో, జిరాక్సును బ్యాంకు యందే ఉచితంగా అందిస్తున్నామని, వ్యాపారస్తులకు వ్యాపార వృద్ధికై ఋణాలను అందిస్తున్నామని, అలాగే కిసాన్ వికాస్ పత్రాలు, పోస్టుఆఫీస్ డిపాజిట్లపై కూడ కేవలం 0.83 పైసలకే అనగా 10%ప/అ రేటుకి ఋణసౌకర్యం అందిస్తున్నామని వినియోగదారులు ఇట్టి సౌకర్యాన్ని వినియోగించుకోవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఆఫీసర్ జి. రాము, జూనియర్ ఆఫీసర్ ఎమ్.ఏ. ఆసీఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఐదు రాష్ట్రాలు -- ఐదు తీర్పులు: దేశవ్యాప్తంగా సమతుల్య ప్రజాభిప్రాయం రూపుదిద్దుకుంటోంది

### .....డా. జితేందర్ రావు తనుగుల, సీనియర్ జర్నలిస్ట్



సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఏప్రిల్ 30 : ఐదు కీలక రాష్ట్రాల్లో ఎన్నికల ప్రక్రియ ముగియడంతో దేశ రాజకీయ దృశ్యంలో స్పష్టత నెలకొంటోంది. తుది ఫలితాలపై అధికారిక ప్రకటన ఎన్నికల సంఘం నుంచి రావాల్సి ఉన్నప్పటికీ, ప్రాథమిక ధోరణులు మరియు గ్రౌండ్ స్థాయి అంచనాలు సమతుల్యమైన ప్రజాభిప్రాయాన్ని సూచిస్తున్నాయి. ఇది భారత ఓటర్ల వైవిధ్యాన్ని, పరిపక్వతను ప్రతిబింబిస్తోంది. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. మమతా బెనర్జీ నాయకత్వం కొనసాగుతున్న ప్రభావాన్ని ఇది స్పష్టం చేస్తోంది. భారతీయ జనతా పార్టీ నుంచి గట్టి పోటీ ఉన్నప్పటికీ, రాష్ట్ర రాజకీయాల్లో ప్రాంతీయ శక్తుల ఆధిపత్యం కొనసాగుతున్నట్లు కనిపిస్తోంది.కేరళలో మళ్లీ చక్రాకార ప్రజాస్వామ్యం ప్రతిఫలిస్తోంది. ప్రాథమిక అంచనాల ప్రకారం యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్‌కు స్వల్ప ఆధిక్యం లభించే అవకాశాలు ఉన్నాయి. ఇది రాష్ట్రంలో మారుతూ వచ్చే ప్రభుత్వాల సంప్రదాయాన్ని మరింత బలపరచనుంది.అస్సాంలో హిమంత బిస్వా శర్మ నాయకత్వంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ తన ఆధిపత్యాన్ని కొనసాగించే సూచనలు కనిపిస్తున్నాయి. పాలనలో నిరంతరత్వం, బలమైన సంస్థాగత నిర్మాణం ఓటర్లను ఆకట్టుకున్నట్లు తెలుస్తోంది.తమిళనాడులో ద్రవిడ మున్నేట్ర కళగం మరోసారి అధికారాన్ని దక్కించుకునే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఎం.కె. స్టాలిన్ నాయకత్వంలో అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు ప్రజాభిమానాన్ని మరింత బలపరిచినట్లు అంచనాలు సూచిస్తున్నాయి. ఇదే సమయంలో అన్నాడీఎంకే తిరిగి పుంజుకునేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తోంది .పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంతంలో పోటీ ఉత్కంఠభరితంగా కొనసాగుతున్న ప్పటికీ, స్వల్ప ఆధిక్యం ఎన్‌డీఏకు దక్కే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే సీట్ల సంఖ్య తక్కువగా ఉండటంతో చిన్న మార్పులే తుది ఫలితంపై ప్రభావం చూపే అవకాశముంది.మొత్తంగా ఈ ఎన్నికల ధోరణులు దేశంలో ఏకైక రాజకీయ తరంగం లేదని, ప్రాంతానికో ప్రత్యేకమైన ప్రజాభిప్రాయం ఏర్పడుతోందని స్పష్టం చేస్తున్నాయి. స్థానిక నాయకత్వం, పాలన, ప్రజల ఆశలు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేస్తున్నాయి.ఇది భారత ప్రజాస్వామ్యంలో ఒక ముఖ్యమైన మార్పును సూచిస్తోంది. ఓటర్లు ఇప్పుడు వాగ్దానాల కంటే పనితీరును, రాజకీయ ప్రసంగాల కంటే పాలనను ప్రాధాన్యతగా తీసుకుంటున్నారు. స్థానిక సమస్యలు, నాయకత్వంపై విశ్వాసం ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు.తుది ఫలితాల కోసం దేశం ఎదురు చూస్తున్న వేళ, ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది---భారత ప్రజాస్వామ్యం సజీవంగా, పోటీతో కూడుకుని, ప్రజల సంకల్పంపై నిలబడి కొనసాగుతోంది.

# హెచ్ఎంఏటీ ఆధ్వర్యంలో ఘనంగా 'హోమియో ఫెస్ట్--2026'

సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఏప్రిల్ 30 : హోమియో వైద్య పితామహుడు డా. శామ్యూల్ హానిమన్ 271వ జయంతిని పురస్కరించుకుని హోమియోపతిక్ మెడికల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (హెచ్ఎంఏటీ) ఆధ్వర్యంలో 'హోమియో ఫెస్ట్--2026' కార్యక్రమం ఖైరతాబాద్‌లోని ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ ఆడిటోరియంలో బుధవారం ఘనంగా జరిగింది.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ ఐఏఎస్ అధికారి, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య కార్యదర్శి ఎల్.వి. సుబ్రహ్మణ్యం దీప ప్రజ్వలన చేసి డా. హానిమన్, డా. ఎన్. రామయ్య చిత్రపటాలకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎంఏటీ అధ్యక్షుడు డా. కె. గోపాలకృష్ణ మాట్లాడుతూ హోమియో వైద్య విద్యార్థుల్లో క్లినికల్ నైపుణ్యాలు, సృజనాత్మకత, పోటీ భావన పెంపొందించడమే ఫెస్ట్ ఉద్దేశమని తెలిపారు. ప్రధాన కార్యదర్శి డా. జి. దుర్గాప్రసాద్ రావు సంస్థ కార్యకలాపాలను వివరించారు.విశిష్ట అతిథులుగా తెలంగాణ ఆయుష్ డైరెక్టర్ ప్రొ. డా. పెరుగు శ్రీకాంత్ బాబు, కిమ్స్ హాస్పిటల్ చైర్మన్ డా. బి. భాస్కర్ రావు, ఆయుష్ (హోమియో) అదనపు సంచాలకులు ప్రొ. డా. ఎన్. లింగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిమ్స్-హెచ్ఎంఏటీ సంయుక్తంగా నిర్వహించే 'క్లినికల్ అబ్జర్వర్‌షిప్' కోర్సును ఆవిష్కరించారు.ప్రముఖ హోమియో వైద్యుడు డా. జి. జనార్ధన్ రెడ్డి, కర్ణాటకకు చెందిన వెటరినరీ నిపుణుడు డా. పి.కె. నిజలింగప్ప ప్రత్యేక ఉపన్యాసాలు చేశారు. యువ వైద్యుల కెరీర్‌పై డా. గోహెల్ షేక్ ప్రసంగించారు.ఫెస్ట్‌లో భాగంగా సైంటిఫిక్ సెషన్స్, పోస్టర్ ప్రెజెంటేషన్స్, క్విజ్, స్లోగన్, రీల్స్, లైవ్ మెటీరియా మెడికా వంటి పోటీలు




నిర్వహించగా తెలంగాణలోని వివిధ హోమియో కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేయడంతో పాటు బిహెచ్ఎంఎస్, ఎండీ (హోమియో) టాపర్లకు డా. హానిమన్ అవార్డులు ప్రదానం చేశారు. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమానికి పూర్వ కేంద్ర మంత్రి డా. సముద్రాల వేణుగోపాల చారి ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎంఏటీ ఉపాధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, వైద్య విద్యార్థులు, ఫ్యాకల్టీ, హోమియో ప్రాక్టీషనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీతాఫల్‌మండి విద్యాసంస్థల నిధుల విడుదలకు అఖిలపక్ష డిమాండ్

సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఏప్రిల్ 30 : సీతాఫల్‌మండి విద్యాసంస్థల భవన నిర్మాణానికి మంజూరైన రూ.30 కోట్ల నిధులను తక్షణమే విడుదల చేయాలని, అలాగే విజయ డైరీ ప్రభుత్వ పాఠశాలకు శాశ్వత భవనం ఏర్పాటు చేయాలని సికింద్రాబాద్ నియోజకవర్గ అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు.ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థి ఆదమ్ సంతోష్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సీతాఫల్‌మండిలో పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాలలకు సరిపడా వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, భవనాల నిర్మాణం రెండేళ్లుగా పెండింగ్‌లో ఉందని తెలిపారు.అలాగే తార్నాక విజయ డైరీ పాఠశాల శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు తగ్గిపోతున్నారని, అదే ప్రాంతంలో స్థలం కేటాయించి ఆధునిక పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరారు.ఈ అంశాలపై ఆదమ్ సంతోష్ కుమార్ సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల



పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టీడీపీ, సీపీఐ, బీఎస్పీ, కాంగ్రెస్ తదితర పార్టీల నాయకులు పాల్గొన్నారు.



# ఆలూరు లో నల్ల పోచమ్మ తల్లికి బోనాలు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఏప్రిల్ 30

జగిత్యాల జిల్లా రాయికల్ మండల పరిధిలోని ఆలూరు గ్రామంలో గురు వారం రోజున గ్రామ ప్రజల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నల్ల పోచమ్మ బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. మహిళలు ఉపవాసం ఉండి బోనం నెత్తిన పెట్టుకొని డప్పు చప్పుల నడుమ అమ్మవారి మందిరానికి తీసుకెళ్లి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, గ్రామ పంచాయతీ కార్యవర్గం, వివిధ కుల సంఘాల పెద్దలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





# పోలీసులకు ఉచిత కంటి పరీక్ష శిబిరం

సికింద్రాబాద్, వార్త ఏప్రిల్ 30 :

హబ్సిగూడలోని ఆనంద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఓయూ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. ఈ శిబిరం ఓయూ ట్రాఫిక్ పీఎస్ వద్ద ఏర్పాటు చేయగా, ట్రాఫిక్ ఓయూ, ట్రాఫిక్ చిలుకలగూడ, లా & ఆర్డర్ ఓయూ పోలీస్ స్టేషన్లకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు.పోలీసుల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా నిర్వహించిన ఈ శిబిరంలో వైద్య నిపుణులు కంటి సమస్యలను పరిశీలించి అవసరమైన సూచనలు అందించారు. ఈ కార్యక్రమాన్ని పోలీసులు అభినందిస్తూ, ఇలాంటి శిబిరాలు తరచుగా నిర్వహించాలని కోరారు.